
47 మంది డీఎస్పీలు, 278 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసు అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. గురువారం 47 మంది డీఎస్పీలు, 278 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నెలరోజుల్లో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందనే సంకేతాల నేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు విభాగాన్ని ప్రక్షాళన చేశారు. రెండు విడతలలో ఏకంగా 77 మంది డీఎస్పీలను, 410 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. ఎన్నికల సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు వారికి అనుకూలమైన అధికారులను నియమింపచేసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి.



రాష్ట్రానికి మొండిచేయి

- నీటి పారుదలకు ప్రాజెక్టుల ఊసే లేదు
- రాయచూరు ఎయిమ్స్‌పై ఆశలు గల్లంతు
- నిరాశ మిగిల్చిన నిర్మలా సీతారామన్ బడ్జెట్



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, రాష్ట్రం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో కర్ణాటకపై కనీసం ఒకటి రెండైనా వరాలు కురిపిస్తారని ప్రజలు ఆశగా ఎదురు చూశారు. ప్రత్యేకించి గతంలో అప్పర్ భద్రాకు రూ. 5వేల కోట్లు ప్రకటించినట్లే ఈసారి కూడా నీటిపారుదల ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయిస్తారని భావించారు. సామాజికంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న కల్యాణ కర్ణాటక లోని రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. దేశ ఐటీబీటీ రాజధానిగా ఉన్న బెంగళూరు ఐటీ వేతన జీవులు సైతం పన్నుల మినహాయింపు మొత్తం పెరుగుతుందని భావించారు. అందరి ఆశలు తల్లకిందులయ్యాయి. మొత్తానికి నిర్మలా సీతారామన్ వికసిత్ భారత్ బడ్జెట్‌ను ప్రకటించారని బీజేపి, జేడీఎస్ నేతలు ప్రశంసల వర్షంకురిపించగా, అధికార కాంగ్రెస్ మాత్రం పెదవి విరిచింది. రాష్ట్రం నుంచి బీజేపీకి 26 మంది జేడీఎస్‌కు ఒక ఎంపీ ఉన్నా కనీసం ఒక్క ప్రాజెక్టయినా సాధించుకోలేకపోయారని ఎద్దేవా చేసింది.

వికసిత కాదు... వినాశకారి బడ్జెట్

- అప్పుల భారం తడిసి మోపెడు
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపాటు

బెంగళూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'దేశ ప్రజలపై అప్పుల భారాన్ని ఏకంగా రూ.190 లక్షల కోట్లకు పెంచేశారు.. ఇది దేశ వికసిత బడ్జెట్‌కానే కాదు.. ఒకరకంగా చెప్పాలంటే వినాశకారిబడ్జెట్' అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. మంత్రిమండలి సమావేశం అనంతరం ఆయన అధికార నివాసం కృష్ణలో మీడియాతో మాట్లాడారు. మధ్యంతర బడ్జెట్‌లో పన్నుపోటు లేదని, ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ గారడీ చేశారని, ఎన్నికల తర్వాత వాతలు పెడతారని ఆయన తెలిపారు. రుణాలపై చెల్లించాల్సిన వడ్డీతో వందలాది గ్యారెంటీ పథకాలు అమలు చేయవచ్చునని పేర్కొన్నారు. బడ్జెట్ నిరాశాజనకంగా ఉందన్నారు. బడ్జెట్‌లో ప్రస్తావించిన రూ.47 లక్షల కోట్లలో రూ.16 లక్షల కోట్ల కోసం రుణాలపైనే ఆధారపడాల్సి ఉంటుందన్నారు. దేశ ఆర్థిక పరిస్థితిపై బడ్జెట్‌లో స్పష్టత లేదని, నానాటికి పెరిగిపోతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, కరువు పరిస్థితి, రైతుల సమస్యలపై బడ్జెట్‌లో నోరు మెదపలేదన్నారు. కార్పొరేట్ సంస్థలపై ఉన్న కనికరం కేంద్రానికి రైతులపై లేదని ఆయన ఎద్దేవా చేశారు. దేశంలో సార్వభౌమత్వాన్ని రక్షించాలని, రాష్ట్రాలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు న్యాయబద్ధంగా వాటా విడుదల చేయాలని సీఎం డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏటా రూ.4 లక్షల కోట్లను పన్నుల రూపంలో కేంద్రానికి ఇస్తోందని, ఇదే సమయంలో కరువు సాయం అడిగితే ఏమాత్రం స్పందించడం లేదని ఆయన విమర్శించారు. సమాఖ్య వ్యవస్థను ఇలాంటి పరిణామాలు దెబ్బతీస్తాయని హెచ్చరించారు. రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ మంజూరు చేయాలని కేంద్రాన్ని పలుమార్లు కోరామని, అయినా స్పందన లేదని సీఎం ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. అఖండ భారత, అఖండ కర్ణాటక లక్ష్యాలు నెరవేరాలంటే రాష్ట్రాలపై కేంద్రం ఉదారంగా వ్యవహరించాలని తెలిపారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా అంటే భయమని, అందుకే రాష్ట్రం కోసం ఏమీ అడిగే పరిస్థితిలో లేరని మండిపడ్డారు. ఆర్థిక సంఘం సిఫార్సులను సైతం కేంద్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులు, నిరుపేదలకు ఒరిగింది శూన్యమన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

ఇంతటి నాసిరకం బడ్జెట్ ఎప్పుడూ లేదు

- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని, ఇంతటి నాసిరకం బడ్జెట్‌ను తాను ఇంతవరకు ఎప్పుడూ చూడలేదని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఢిల్లీలో కలిసినప్పుడు రాష్ట్ర ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా ఫలితం కనిపించలేదన్నారు. అప్పర్ భద్రా ప్రాజెక్టుకు గత బడ్జెట్‌లో కేటాయించిన రూ. 5వేల కోట్ల నిధుల జాడ లేదన్నారు. ఇంతవరకు పైసా విడుదల కాలేదని తెలిపారు. ఈ అన్యాయంపై ప్రజా పోరాటం చేస్తామన్నారు. బడ్జెట్‌లో జరుగుతున్న అన్యాయంపై కడుపు కాలి ఎంపీ డీకే సురేష్ ప్రత్యేక దేశం గురించి ప్రస్తావించారని అన్నారు. తామంతా అఖండ భారతంలో భాగమనని తెలిపారు. గ్యారెంటీ పథకాలు వచ్చే ప్రభుత్వంలోనూ కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆశీస్సులతో ఐదేళ్ల పాలన పూర్తిచేస్తామని, ఆపై జరిగే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఘన విజయాలు సాధించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

ఇది వికసిత భారత్ బడ్జెట్ : బీజేపీ



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఆశయాలు ఆకాంక్షలకు అద్దంపడుతోందని బీజేపీ పేర్కొంది. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఈ మేరకు నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2047 నాటికి దేశాన్ని వికసిత భారత్‌గా తీర్చిదిద్దేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ నినాదాన్ని మరింత అర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళుతున్న ప్రధాని నరేంద్రమోదీ రైతులు, మహిళలు, యువత, నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. కేంద్ర బడ్జెట్ భారత్‌దేశ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించనుందని బీజేపీ జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప పేర్కొన్నారు. శాసనసభలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ నగరంలో ఒక ప్రకటన విడుదల చేస్తూ లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నా జనాకర్షక పథకాల జోలికి వెళ్లని కేంద్రం వాస్తవ స్థితి ఆధారంగా స్థిరమైన ప్రగతికి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని కొనియాడారు. పదేళ్ల అవధిలో 25 కోట్ల మందిని దారిద్ర్య రేఖ నుంచి తప్పించడం నిజంగానే గొప్ప విషయమని, ఇది మోదీ ప్రభుత్వం వల్లే సాధ్యపడిందని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో ఒక్క కుంభకోణానికి తావు ఇవ్వకుండా పారదర్శక పాలన అందిస్తున్న కేంద్రం తాజా బడ్జెట్‌తో తాను ప్రజల పక్షపాతినని సగర్వంగా చాటుకుందని మాజీ సీఎం జగదీష్ శెట్టర్ పేర్కొన్నారు. ప్రజలపై పన్నుల భారం వేయకుండా విజనరీ బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ అందిచడం సంతోషంగా ఉందని బీజేపీ సీనియర్ నేత సీటీ రవి పేర్కొన్నారు.

ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించే బడ్జెట్ : ఎఫ్‌కేసీసీఐ

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారమన్ ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్ దేశ ఆర్థికాభివృద్ధిని పరుగులు పెట్టించేదిలా ఉందని కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య పేర్కొంది. సమాఖ్య అధ్యక్షుడు రమేష్‌చంద్ర లహోటి నగరంలో గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ శాతాన్ని 6.5 నుంచి 5.8 శాతానికి తగ్గించడం వల్ల, ఉత్పాదనా రంగానికి మౌలిక సదుపాయలను పెంచాలని నిర్ణయించడం ద్వారా ఈ లక్ష్యాలను సాధించే మార్గాన్ని సులభతరం చేసిందని పేర్కొన్నారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పాండిచ్చేరిలతో కూడిన దక్షిణాది రాష్ట్రాల పర్యాటక సదస్సుకు కేంద్రబడ్జెట్ ఊతమిస్తోందని పేర్కొన్నారు.

ప్రజల కష్టాలను గాలికొదిలేశారు : రక్షారామయ్య



వికసిత భారత బడ్జెట్ అంటూ బీజేపీ నేతలు డబ్బా కొట్టుకుంటున్నారని, నిజానికి కేంద్ర బడ్జెట్‌లో దేశ ప్రజల కష్టాలను పూర్తిగా గాలికొదిలేశారని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రక్షారామయ్య పేర్కొన్నారు. బడ్జెట్‌పై స్పందిస్తూ గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగాల సృష్టి, పెట్రోలియం ధరల తగ్గుదలపై బడ్జెట్‌లో ఊసే లేదని మండిపడ్డారు. రైతుల్ని, మహిళల్ని లక్షాధిపతుల్ని చేస్తామని చెప్పిన కబుర్లు సైతం బూటకమని తేలిందన్నారు. కేంద్రంలోని నిర్మలా సీతారామన్ బడ్జెట్‌కంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీలే ఎంతో మెరుగ్గా ఉన్నాయని ప్రజలు మాట్లాడుకుంటున్నారని వెల్లడించారు. రాష్ట్రం నుంచి బీజేపీకి 26 మంది, జేడీఎస్ నుంచి ఒకరు మొత్తం 27 మంది ఎంపీలున్నా ఒక్క ప్రాజెక్టును సైతం సాధించుకోలేకపోయారని విమర్శించారు.

ఇది దూరదృష్టి బడ్జెట్

- మాజీ సీఎం కుమారస్వామి



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతంగా ఉందని, ఇది దూరదృష్టి కలిగిన బడ్జెట్ అని జేడీఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు. బడ్జెట్‌పై స్పందించిన ఆయన రైతులు, యువత, మహిళలు, నిరుపేదలను ప్రాధాన్యతా కేంద్రాలుగా గుర్తించడం హర్షణీయమన్నారు. బడ్జెట్ అన్నదాతలను వెన్నుతట్టి ప్రోత్సహించేదిగా ఉందన్నారు. ప్రత్యేకించి ఉత్పాదనా రంగానికి పెద్దపీట వేయడంతో ఉద్యోగాల సృష్టి జరగనుందన్నారు. పర్యాటక రంగానికి కూడా బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు. బడ్జెట్‌లో సామాన్యులపై భారం వేయకపోవడం హర్షదాయకమన్నారు. రానున్న పూర్తిస్థాయి బడ్జెట్‌లో కర్ణాటకకు ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.



ఉత్సవంలో నందికోళ్లు ఆడుతున్న కళాకారులు

హంపిలో ప్రారంభమైన వసంత వైభవం

కంప్లి, ఫిబ్రవరి 1 : హంపి ఉత్సవాల సందర్భంగా ఆదివారం హోస్పేటలో విజయనగర వసంత వైభవాన్ని కళాకారులు ప్రారంభించారు. ఓ డకరాయ దేవస్థానం నుంచి వివిధ ప్రధాన వీధుల్లో జానపద గీతాలు, నంది కోళ్లు, వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు హంపి ఉత్సవాలకు ఒక రోజు ముందుగానే అధికారులు నిర్వహిస్తారు. కార్యక్రమంలో రాష్ట్రంలోనే వివిధ పట్టణాలు, గ్రామాల నుంచి భారీఎత్తున కళాకారులు పాల్గొని తమదైన శైలితో నృత్యం చేస్తూ, పాడుతూ ఆకట్టుకున్నారు. వసంత వైభవాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాల నుంచి భారీఎత్తున ప్రజలు, భక్తులు తరలివచ్చారు.



డోళ్లతో నృత్యం చేస్తున్న కళాకారులు

సేవా కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత

- మాజీ మంత్రి అరవింద లింబావళి



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి అరవింద లింబావళి

మహదేవపుర, ఫిబ్రవరి 1: పండుగలు ఇతర రోజుల్లో అనవసర ఖర్చు చేయకుండా సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ మంత్రి అరవింద లింబావళి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని జ్యోతిపుర గ్రామంలో కొలువైన జ్యోతిర్లింగస్వామి ఆలయాన్ని గురువారం ఉదయం సందర్శించారు. తన 57వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన పలు సేవా కార్యక్రమాల్లో ఆయనతో పాటు సతీమణి, ఎమ్మెల్యే మంజుళాఅరవింద లింబావళి కూడా పాల్గొన్నారు. పలువురు నాయకులు, అభిమాను లు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లింబావళి మాట్లాడుతూ పుట్టినరోజు, పెళ్లిరోజు ఇతర రోజుల్లో పేదలు, అనాథలు, వృద్ధులకు చేతనైన సాయం, ప్రమాదంలో అవసరమైనవారికి రక్తదానం వంటివి చేయాలని పిలుపునిచ్చారు. పలుచోట్ల అభిమానులు అ న్నదానం, అనాథాశ్రమాల్లో నిత్యావసరాల పంపిణీ, క్రీడాకారులు, దివ్యాంగులకు ప్రోత్సాహకాలు అందించారు. గోశాలలో పశువులకు మేత, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. నేత్రదాన పరీక్షలు, ఆరోగ్య శిబిరాలు కూడా నిర్వహించారు. ఏఈసీఎస్ లే అవుట్‌లో యువనాయకుడు జయదేవ్ ఆధ్వర్యంలో 3వేల మందికి నిత్యావసరాలు పంపిణీ చేశారు. హూడి స్పోర్ట్స్‌క్లబ్‌లో దక్షిణభారత స్థాయిలో సీనియర్ పురుషులు, మహిళా వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. కాగా నాలుగైదురోజులుగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సాగిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, లెమన్ స్పూన్, పరుగు, మ్యూజికల్ చైర్స్, ఉట్టికొట్టే పోటీలు ఇతర క్రీడాపోటీల విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ పట్టణ, గ్రామీణ మండల అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, నటరాజ్, నాయకులు ఎల్ రాజేశ్, నాగేశ్, లోకేశ్, ధనంజయ, శ్రీధర్‌రెడ్డి, జయదేవ్ తదితరులు, అభిమానులు పాల్గొన్నారు.






అనాథాశ్రమంలో చిన్నారికి కేక్ తినిపిస్తూ... పౌరకార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి

8న సీఎం రాష్ట్ర స్థాయి జనస్పందన

బెంగళూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి సిద్దరామయ్య రెండోసారి ఈనెల 8న జనస్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆరోజు విధానసౌధ ఎదురుగా జనస్పందన నిర్వహించేందుకు విధానసౌధ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించనున్నారు. ఇందుకోసం అన్నిశాఖల ముఖ్య అధికారులను అందుబాటులో ఉండేలా ఆదేశించారు. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ప్రజలు సేదతీరేందుకు తగిన కుర్చీలను ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరు. టిఫిన్, భోజన సౌలభ్యాన్ని కల్పించడంతో పాటు మెజిస్టిక్, రైల్వేస్టేషన్ నుంచి విధానసౌధ దాకా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. శాఖల వారిగా అర్జీలు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లను సిద్ధం చేయనున్నారు. నెలరోజుల కిందట సీఎం అధికారిక నివాసం కృష్ణలో జనస్పందన ఏర్పాటు చేశారు. భారీగా ప్రజలు రావడంతో కుమారకృప రోడ్డును పూర్తిగా మూసివేశారు. దీంతో సామాన్య ప్రజలకు అసౌకర్యం కలిగింది. రెండోసారి అక్కడే నిర్వహిస్తే సమస్యగా ఉంటుందని విధానసౌధలో నిర్వహిస్తున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.34	1,616.16
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	355	7,888
సామర్థ్యం (టీఎంసీలు)	9.70	51.22

ఘనంగా మడివాళ మాచిదేవ జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 1 : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కురుగోడు పట్టణంలో గురువారం దాడులు చేసి ఇద్దరు బాలకార్మికులను రక్షించినట్లు జిల్లా బాలకార్మికుల పథకం ప్రాజెక్టర్ డైరెక్టర్ మౌనేశ్ తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అధారిటీ , జిల్లా బాలకార్మిక పథకం, పోలీస్ ఇన్‌స్పెక్టర్ల టాస్క్ ఫోర్స్ ఈ ఆపరేషన్ నిర్వహించారు. గ్యారేజీ , బేకరీ, హోటల్, మెకానిక్ షాప్, కిరాణా దుకాణం, వ్యవసాయ క్షేత్రాల వద్ద ఆకస్మిక దాడులు నిర్వహించి ఇద్దరు బాలకార్మికులను విధుల నుంచి విముక్తి చేసి వారిని విద్యాస్రవంతిలోకి తీసుకురావడానికి సంబంధిత శాఖకు అప్పగించినట్లు తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీలో కురుగోడు గ్రేడ్-2 తహసీల్దార్ మల్లేశప్ప, లేబర్ ఇన్‌స్పెక్టర్ రవిదాస్, కురుగోడు మున్సిపాలిటీ ఇన్‌స్పెక్టర్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాచిదేవను ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, ఫిబ్రవరి 01 : మడివాళ సమాజంలోని ప్రతి ఒక్కరు మడివాళ మాచిదేవను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే జేఎన్‌గణేష్ పిలుపునిచ్చారు. కంప్లిలో గురువారం మడివాళస మాజం మాచిదేవ జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం మాచిదేవ భావచిత్రపటానికి పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు పంపాపతి, తహసీల్దార్ శివరాజు,ఈవో శ్రీకుమార్, కంప్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, మడివాళ సమాజం అధ్యక్షులు ఉలిగప్ప, గౌరవాధ్యక్షులు సన్న ఈరప్ప, డాక్టర్ సంగమేష్, రాజు, రాజేష్, ఆచారి, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాయచూరులో..

మడివాళ మాచిదేవ జయంతిని నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జయంతి కార్యక్రమంలో సమాజం ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని స్థానిక ఆర్టీఓ సర్కిల్ వద్దగల మడివాళ మాచిదేవ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సిరుగుప్పలో ఇస్లామిక్ ఎడ్యుకేషన్ పరీక్షలు



ఉర్దూ ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 01 : మొట్టమొదటిసారిగా ఇస్లామిక్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరిగాయి. సిరుగుప్ప పట్టణంలో 6వ వార్డు ఉర్దూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బెంగళూరు బీఈ విద్యాసంసంస్థ ఆధ్వర్యంలో ఇస్లామిక్ ధర్మం, సంస్కృతి ఆధ్యాత్మికపై పోటీలు జరిగాయి. ఇందులో 6వ వార్డు ఉర్దూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అబ్దుల్ కలామ్ ఆజాద్ పాఠశాల విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాశారు. ఇస్లామిక్ ధర్మం, సంస్కృతి విషయాలలో విద్యార్థులకు జ్ఞానం పెంపొందించడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ముఖ్య ఉపాధ్యాయురాలు షాహినా తెలిపారు.

విద్యుత్ వెలుగుల్లో హంపీ జిగేల్

కంప్లి, ఫిబ్రవరి 01 : ఉత్సవాల సందర్భంగా హంపీ పూర్వవైభవాన్ని సంతరించుకుంటోంది. వెలుగు జిలుగులతో పర్యాటకులను పూర్తిగా ఆకట్టుకుంటోంది. మండపాల్లోను, కమలాపురం చెరువు వద్ద ఏర్పాటైన విద్యుత్ దీపాలు పర్యాటకుల్లో సంతోషాన్ని నింపుతున్నాయి. ఈ యేడాది హంపీ ఉత్సవాలకు రూ.14 కోట్లు ఇప్పటికే మంజూరు కాగా, అవసరమైతే అదనంగా రూ.3 కోట్లు అదనంగా విడుదల చేసేందుకు సిద్ధంగా వున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ముందుకొచ్చి ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఇప్పటికే పోలీసు బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లు సిద్ధం చేశారు. మొత్తానికి ఈ వేడుకలను ఘనంగా జరపాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారు.

నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు



గాలిలోకి లేస్తున్న హెలికాప్టర్లు



విద్యుత్ వెలుగుల్లో ఓ మండపం

హెలికాప్టర్ రైడ్ రెడీ!

హంపీ ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం కమలాపురం మయూర భువనేశ్వరి హోటల్ ప్రాంగణంలో హెలికాప్టర్ రైడ్ ప్రారంభమైంది. కేవలం ఆరు నుంచి ఎనిమిది నిమిషాలు మాత్రమే హంపీని వీక్షించేందుకు ఈ బైస్కై ఏర్పాటు చేశారు. ఇందుకు గాను రూ.4300 ఫీజును ఏర్పాటు చేశారు. విదేశాల నుంచి వచ్చిన పర్యాటకులు ఈ బైస్కై ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేస్తుండగా కొంత మంది హంపీ ఉత్సవాలకు వచ్చిన పర్యాటకులు అధిక ఫీజు పెట్టారని నిరుత్సాహానికి గురవుతున్నారు. ఎంతో దూరం నుంచి ఉత్సవాలను సందర్శించేందుకు వచ్చిన వారు ఈ హెలికాప్టర్ రైడ్‌లో హంపీ ప్రాంతాలను సందర్శించాలని ఉబలాటపడుతున్నారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసు బలగాలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ దివాకర్ తెలియజేశారు.

వెట్టిచాకిరీ నుంచి బాల కార్మికుల విడుదల



బాలకార్మికులను విడిపిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 1 : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కురుగోడు పట్టణంలో గురువారం దాడులు చేసి ఇద్దరు బాలకార్మికులను రక్షించినట్లు జిల్లా బాలకార్మికుల పథకం ప్రాజెక్టర్ డైరెక్టర్ మౌనేశ్ తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అధారిటీ , జిల్లా బాలకార్మిక పథకం, పోలీస్ ఇన్‌స్పెక్టర్ల టాస్క్ ఫోర్స్ ఈ ఆపరేషన్ నిర్వహించారు. గ్యారేజీ, బేకరీ, హోటల్, మెకానిక్ షాప్, కిరాణా దుకాణం, వ్యవసాయ క్షేత్రాల వద్ద ఆకస్మిక దాడులు నిర్వహించి ఇద్దరు బాలకార్మికులను విధుల నుంచి విముక్తి చేసి వారిని విద్యాస్రవంతిలోకి తీసుకురావడానికి సంబంధిత శాఖకు అప్పగించినట్లు తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీలో కురుగోడు గ్రేడ్-2 తహసీల్దార్ మల్లేశప్ప, లేబర్ ఇన్‌స్పెక్టర్ రవిదాస్, కురుగోడు మున్సిపాలిటీ ఇన్‌స్పెక్టర్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులే సమాజానికి శాశ్వత ఆస్తులు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 1: భక్తులే సమాజానికి శాశ్వత ఆస్తులని, సామాజిక అసమానతలను రూపుమాపడంతో పాటు విజ్ఞాన వ్యాప్తికి మడివాళ మాచిదేవ చేసిన కృషి గొప్పదని మేయర్ శ్వేత తెలిపారు. గురువారం నగరంలోని డా.రాజ్‌కుమార్ రోడ్డులోని బీడీఏఏ ఫుట్‌బాల్ మైదానం హాల్లో జిల్లాపరిపాలన, జిల్లాపంచాయితీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మహానగర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మడివాళ మాచిదేవ జయంతి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మడివాళ వర్గాల ప్రజలు ఆయన వలన విస్తృత స్ఫూర్తి పొందారన్నారు. కాయకష్టం ప్రాతిపదికన చీలిపోతున్న సమాజానికి మాచిదేవుని సందేశం ఆదర్శంగా నిలవాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ అలం భాషా మాట్లాడుతూ, మాచిదేవుడు సమాజంలో గొప్ప వక్త అని కొనియాడారు. 12వ శతాబ్దంలో బసవన్న సమకాలికుల్లో మడివాళ మాచిదేవ ఒకరని తెలిపారు. అజ్ఞానం వల్ల పేదలు దోపిడీకి గురవుతున్న తరుణంలో మాచిదేవుడు అవగాహన ద్వారా దోపిడీని అడ్డుకున్నాడని, ఎన్ని కష్టాలు పడ్డా పేదల మోక్షానికి మార్గదర్శిగా నిలిచారన్నారు. ఈసందర్భంగా మహానగర పాలిక డిప్యూటీ మేయర్ బి.జానకి, తహసీల్దార్ గురురాజ్, కన్నడ సాంస్కృతిక సహాయక సంచాలకులు బి.నాగరాజు, సంఘం నాయకులు, కార్యాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

శోభయాత్రతో సందడి

మడివాళ మాచిదేవ జయంతిలో భాగంగా నిర్వహించిన శోభయాత్రలో మహిళలు బుట్టలు ఎత్తుకుని వివిధ సాంస్కృతిక కళాబృందాలతో సందడి చేశారు. మహానగర పాలిక మేయర్ శోభయాత్రను ప్రారంభించారు. యాత్ర ఇందిరా సర్కిల్, గడిగి చెన్నప్ప సర్కిల్ , బెంగళూరు రోడ్డు , బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్, తేరువీధి, హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్, జిల్లా కలెక్టర్ కార్యాలయం మీదుగా బీడీఏఏ మైదానంలోని వేదికకు చేరుకుంది. అక్కడ సమావేశం నిర్వహించారు.

మడివాళ మాచిదేవ జయంతిలో మేయర్ శ్వేత



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ శ్వేత

మాజీ దేవదాసీలకు వేతనం పెంచాలి

● హెడ్ పోస్ట్ ఆఫీసు వద్ద ఆందోళన



హెడ్ పోస్ట్ ఆఫీసు వద్ద ఆందోళన చేస్తున్న మాజీ దేవదాసీ మహిళలు

రాయచూరు, ఫిబ్రవరి 1 : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రకటించనున్న వార్షిక బడ్జెట్‌లో మాజీ దేవదాసీ మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని మాజీ దేవదాసీ మహిళలు డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ల సాధన కోసం వారు గురువారం నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీసు వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన దేవదాసీ మహిళ సంఘం నాయకులు, 2016-17 వార్షిక బడ్జెట్‌లో మాజీ దేవదాసీ మహిళలకు నెలకు రూ. వెయ్యి వేతనం ప్రకటించారని అనంతరం దాన్ని రూ.1500కు పెంచారన్నారు. గడచిన 8 ఏళ్లుగా ఎన్నిసార్లు విన్నవించినా ఏ ప్రభుత్వం కూడా నెలవారీ వేతనం పెంపుపై దృష్టి సారించలేదన్నారు. దీంతో పాటు మాజీ దేవదాసీ మహిళల పిల్లల విద్య వికాసం కోసం ఎలాంటి ప్రత్యేక కార్యక్రమాలు ప్రకటించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవదాసీ మహిళల స్థితిగతులను, వారి జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని వారి సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి జిల్లాధికారి కార్యాలయం ద్వారా వినతి పత్రం అందజేశారు.

సబ్జెక్టులను సరళీకృతం చేయాలి: కలెక్టర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 1: సబ్జెక్టులను పిల్లలకు అర్థమయ్యేలా సరళీకృతం చేయాలని, సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత సాధించి ప్రాక్టీస్ చేయడానికి అవసరమైన అంశాల జాబితా రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈసంవత్సరం పదవతరగతి వార్షిక ఫలితాల మెరుగుదలకు జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయితీ, పాఠశాల విద్యాశాఖ చేపట్టాల్సిన చర్యలపై జిల్లాకలెక్టర్ కార్యాలయ హాల్లో ఏర్పాటు చేసిన ప్రగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పిల్లలు నేర్చుకునేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, మ్యాప్ పాయింటింగ్ నేర్పించాలని ఆయన సూచించారు. పిల్లల అభ్యసనపై నిరంతర పర్యవేక్షణ, విశ్లేషణ అనంతరం మిగిలిన 53రోజులు పిల్లలు ధైర్యంగా పరీక్షను ఎదుర్కొనేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. దత్తత తీసుకున్న అధికారులు తప్పనిసరిగా పాఠశాలను సందర్శించి నేర్చుకునే నాణ్యతను పెంచేలా పర్యవేక్షించి పిల్లలందరూ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు పిలుపునిచ్చారు. జిల్లా ముఖ్యకార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ గణితం, సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టుల ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలన్నారు. నోడల్ అధికారులకు మార్గదర్శకాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఫలితాల శాతాన్ని మెరుగు పరిచేందుకు అవసరమైన అన్ని రకాల సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ఉప సంచాలకులు బి.ఉమాదేవి, డైట్ ప్రిన్సిపాల్ హనుమక్క, జిల్లా,తాలూకా స్థాయి అధికారులు, జిల్లాలోని అన్ని తాలూకాల ప్రభుత్వ,ఎయిడెడ్ ఎంపిక చేసిన ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

'గాలి' బీజేపీలో చేరడం అనుమానమే



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ నేత సీటీ రవి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 1: అక్రమ మైనింగ్ రవాణా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి బీజేపీలో చేరే విషయంపై నిర్ణయం తీసుకోవడానికి సమయం పడుతుందని బీజేపీ నేత సీటీ రవి అన్నారు. బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం ఆస్తి కాదని దేశం ముఖ్యమని అనుకునేవారు మాత్రమే లక్షణంగా బీజేపీలోకి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇరవై లోకసభ నియోజకవర్గాల్లో విజయం సాధిస్తామని సిద్దరామయ్య చెప్పారని, ఇప్పుడు అది కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో 28 నియోజకవర్గాల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలో రామమందిర నిర్మాణం తర్వాత సర్వం రామమయం అయిందని, లోకసభలో నాలుగు వందల సీట్లు గెలుస్తామని సీటీ రవి విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడ చూసినా రాముడి ఆరాధన పెరిగిపోయిందన్నారు. మండ్యా విషయంలో కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందన్నారు. కురుబ హాస్టల్‌పై ఎవరూ దాడులు చేయలేదన్నారు. ఎవరో కాంగ్రెస్ నేతల ఫ్లెక్సీలను చింపారని, కాంగ్రెస్‌తప్పుడు వార్తాలను ప్రచారం చేస్తోందన్నారు.. కురుబలు హిందువులు కాదా? అని ప్రశ్నించారు. వారు సంగొళ్ళి రాయన్న, కనకదాసు సనాతన వారసత్వాన్ని నిలబెట్టినవారని గుర్తుచేశారు. కురుబలు కూడా హనుమాన్ భక్తులే అన్నారు. ఈసందర్భంగా మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ సిటీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, ఎంఎల్సీ సతీశ్, సిరుగుప్ప మాజీ ఎమ్మెల్యే సోమప్ప తదితరులు పాల్గొన్నారు.

పనిమనిషిని బాధపెట్టిన ఎమ్మెల్యే.. పెల్లుబికిన నిరసన

హోసూరు(సిప్‌కాట్) ఫిబ్రవరి 1: పల్లావరం డీఎంకే శాసనసభ్యుడు ఆయన భార్య వీరిద్దరు తన ఇంటిలో పనిచేసే అమ్మాయి ఎస్సీ కావడంతో అమెకు నిండా పనిచెబుతూ ఆ అమ్మయిని చిత్రహింసలు పెట్టారని ఆరోపిస్తూ గురువారం నిరసన ప్రదర్శన చేశారు. హోసూరు కార్పొరేషన్ విద్యుత్ బోర్డు కార్యాలయం ఎదుట కృష్ణగిరి పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే తరపున మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన ప్రదర్శన జరిగింది. ఈ నిరసనలో అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి మునుస్వామి, మాజీ శాసన సభ్యులు రాజేంద్రన్, హోసూరు ప్రాంత కార్యదర్శులు వాసుదేవన్, మంజు, సంయుక్త కార్యదర్శులు హరీశ్ రెడ్డి, రవికుమార్, బాబు వెంకటాచలం, హోసూరు మండల కమిటీ నాయకులు జై.ప్రకాశ్, పురుషోత్తమరెడ్డి, హోసూరు కార్పొరేషన్ ప్రతిపక్ష నాయకుడు నారాయణన్, జిల్లా ఉపకార్యదర్శి మదన్, అమ్మ అసెంబ్లీ జిల్లా కార్యదర్శి సిటీ జగదీశ్, రాము, ఎంజీఆర్ యువజన పార్టీ మాదయ్యన్, చెన్నకృష్ణన్, రాజా, తదితరులు పాల్గొన్నారు.



అన్నాడీఎంకే మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిరసన

హోసూరు జోన్

ఘనంగా ఎద్దుల పండుగ



ఎద్దుల పండుగను వీక్షించేందుకు వేలాది సంఖ్యల్లో గుమికూడిన యువకులు

హోసూరు ఫిబ్రవరి 1 : హోసూరు సమీపంలోని వెంకటేశపురం పంచాయతీ గుడ్లపల్లి గ్రామాల్లో ఎద్దుల పండుగ జరిగింది. శూలగిరి, బేరికై, బాగలూరు, ఉద్దన్నపల్లి, మేలుమలై తదితర ప్రాంతాల నుంచి 200కు పైగా ఎద్దులు, ఆవులను ఈ పండుగల్లో పోటీలకు తీసుకొచ్చారు, ఎద్దులను పట్టుకుని గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు కూడా అందజేశారు. ఈ పండుగను వీక్షించేందుకు వేలాది మంది ప్రజలు, యువకులు పాల్గొన్నారు. ఈ పందాల్లో పాల్గొనడానికి యువకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది ప్రజలు ఈ పోటీల్లో పాల్గొని ఆనందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యదర్శి నాగేశ్, వర్తక బృందం జిల్లా డిప్యూటీ ఆర్గనైజర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు అందివాడి స్టేడియంలో అథ్లెటిక్స్ మ్యాచ్

హోసూరు (మత్తిగిరి), ఫిబ్రవరి 1: అందివాడి స్టేడియంలో శని,ఆదివారాల్లో వాకర్స్ అసోసియేషన్ కేల్లో ఇండియా ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణ అవగాహన అథ్లెటిక్స్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఇందులో 1200 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ పోటీలలో పాల్గొనే 18 సంవత్సరాల లోపు వయస్సు గల విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందించడంతో పాటు అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న విద్యార్థులను గుర్తించి వారికి క్రమం తప్పకుండా శిక్షణ అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో అన్ని రకాల పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చునని, పోటీలు జరిగే రెండు రోజులు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు.

పెరిగిన టమోటా ధర.. రైతుల హర్షం

హోసూరు ఫిబ్రవరి 1 : హోసూరు ప్రాంతాలో టమోటా కిలో రూ.40కు పైగా విక్రయిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హోసూరు, డెంకణీకోట, శూలగిరి, బాగలూరుతో పాటు వేలాది ఎకరాలలో రైతులు పెద్ద ఎత్తున కూరగాయలు, పండిస్తుంటారు. అలాగే హోసూరు నుంచి రాజస్థాన్‌కు, గుజరాత్‌కు 100 నుంచి , 125 లారీల టమోటాలు పంపుతున్నారు. ఈ దశల్లో టమోటా ధర రూ.20 నుంచి, కిల్లో రూ.40 కు పలుకడంతో ఆనందం చెందుతున్న రైతులు, ఒక బాక్సు రూ.800 నుంచి, రూ. 850 కు విక్రయిస్తున్నారు. పలు రాష్ట్రాలకు, జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారు. రైతులు ఈ విషయంపై మాట్లాడుతూ ఉన్నట్టుండి, ధరలు పెరుగుతుండడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.



బడ్జెట్‌పై కాంగ్రెస్ విమర్శలు అర్థరహితం

● మాజీ ఉప ముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్ప



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్ప

రాయచూరు, ఫిబ్రవరి 1 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌కు సమర్పించిన తాత్కాలిక బడ్జెట్ పై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు అర్థ రహితమని మాజీ ఉప ముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్ప అన్నారు. జిల్లాకు గురువారం వచ్చిన ఆయన నగరంలో కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. దేశం ఒక్కటిగా ఉండడం కాంగ్రెస్‌పార్టీకి ఇష్టంలేనట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఉత్తరభారతం, దక్షిణ భారతం అంటూ దీర్ఘాలు తీస్తున్న కాంగ్రెస్ నాయకులకు దేశాన్ని సమైక్యంగా ఉంచడం ఎన్నటికి చేతగాదన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని అన్ని వర్గాల వారి సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు దేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్ మార్గాన్ని మరింత సులభం చేసిందన్నారు. కాగా ఇందిరానే ఇండియా, ఇండియానే ఇందిరా అంటు దేశ వ్యాప్తంగా నినాదాలు మారు మ్రోగించిన కాంగ్రెస్ నాయకులు నరేంద్ర మోదీది వ్యక్తి పూజ అంటు విమర్శలు చేయడం హాస్యస్పదమన్నారు.

మహిళ కడుపులో నుంచి 5 కిలోల గడ్డ తొలగింపు

రాయచూరు, ఫిబ్రవరి 1 : జిల్లాలోని సింధనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజ్ కాట్వ గురువారం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. సింధనూరు నగరానికి చెందిన 30 ఏళ్ల మహిళ అన్నపూర్ణ కడుపులో గడ్డతో కడుపునొప్పితో బాధపడుతుండగా వైద్యులను సంప్రదించడంతో ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు.ఆపరేషన్‌కు పెద్దమొత్తంలో ఖర్చు అవుతుందన్న భయంతో పేద కుటుంబానికి చెందిన మహిళ వెనుకంజ వేశారు. తరచుగా వచ్చే నొప్పితో బాధపడుతున్న మహిళ, ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి డాక్టర్ నాగరాజ్ కాట్వను సంప్రదించారు. పరీక్షలు నిర్వహించిన డాక్టర్ నాగరాజ్ కాట్వ, ఆమెకు చికిత్సలు చేయాలని సూచించగా తాము నిరుపేదలమని తమ కుటుంబ పరిస్థితిని వివరించారు. దీంతో డాక్టర్ నాగరాజ్ ఆమె గర్భకోశంలో నుంచి 5కిలోల కణితిని తొలగించి ఊరట చేకూర్చారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

పంచాక్షర గవాయ్ (జయంతి)



పంచాక్షర గవాయ్ 1892 ఫిబ్రవరి 2న కర్ణాటక రాష్ట్రం హానగల్ తాలూకా కాడశెట్టిహళ్లి ప్రాంతంలో జన్మించారు. పుట్టుకతో అంధుడు. అసలుపేరు గడిగెయ్య. సంగీతంలో చిన్నప్పటి నుంచి రాణించారు. కర్ణాటక, హిందూస్థానీ రాగాలలో ప్రతిభ చాటుకున్నారు. 'జ్ఞానయోగి'గా పేరొందారు. ఆయన జీవిత సాధలనపై ఒక సినిమా కూడా విడుదలైంది. 1944 జూన్ 11న కన్నుమూశారు.

రహీం ఫహీముద్దీన్ దాగర్ (జయంతి)



పద్మభూషణ్ గ్రహీత రహీం ఫహీముద్దీన్ దాగర్ 1927 ఫిబ్రవరి 2న రాజస్థాన్ రాష్ట్రం ఆవార్ ప్రాంతంలో జన్మించారు. ప్రముఖ ఉస్తాద్, తండ్రి అల్లాబండె రహీముద్దీన్ ఖాన్ దాగర్ బాటలో సంగీతంలో ప్రతిభ చాటుకున్నారు. తన ప్రత్యేక ఆలాపనతో 12, 13వ శతాబ్దంలోని సంగీతంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్, కాళిదాస్ సమ్మాన్, జీవిత సాఫల్య పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు. 2011 జులై 27న కన్నుమూశారు.

బులుసు సాంబమూర్తి (వర్ధంతి)



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బులుసు సాంబమూర్తి 1886 మార్చి 4న తూర్పు గోదావరి జిల్లా దుళ్ల గ్రామంలో జన్మించారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర, విశాలాంధ్ర అనే పరమ లక్ష్యసాధనకు నిరంతర కృషి చేసిన కార్యశూరుడు. మద్రాసు శాసనపరిషత్ అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆయన గాంధీజీ పిలుపుతో న్యాయవాది వృత్తి వదిలి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1935లో మద్రాస్ ప్రొవిన్షియల్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంతో చక్రవర్తి రాజగోపాలాచారి సీఎంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 1937 నుంచి 1942 వరకు సాంబమూర్తి స్పీకర్‌గా కొనసాగి సభకు గౌరవ ప్రతిష్ఠలు తెచ్చారు. 1958 ఫిబ్రవరి 2న కన్నుమూశారు.

కె. విశ్వనాథ్ (వర్ధంతి)



పద్మశ్రీ గ్రహీత కాశీనాథుని విశ్వనాథ్ 1930 ఫిబ్రవరి 19న రేపల్లెలో జన్మించారు. తెలుగు సినిమా దర్శకుడిగా కళాతపస్వి బిరుదు పొందారు. శంకరాభరణంకు జాతీయ పురస్కారం, సప్తపదికి జాతీయ సమగ్రత పురస్కారం పొందారు. స్వాతిముత్యం సినిమా ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయింది. ఆయన సినిమాలలో సంగీతానికి ప్రాముఖ్యత ఉండేది. కెరీర్ చివరల్లో దర్శకత్వ బాధ్యతలు తగ్గించుకుని నటుడిగా ప్రేక్షకులను అలరించారు. రఘుపతి వెంకయ్య పురస్కారం, దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్నారు. 2023 ఫిబ్రవరి 2న శివైక్యం చెందారు.

ఆన్‌లైన్ ద్వారా వివాహ రిజిస్ట్రేషన్

●12 నుంచి శాసనసభ సమావేశాలు.. 16న బడ్జెట్ ● కేబినెట్ కీలక నిర్ణయాలు

బెంగళూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇకపై వివాహాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. నేరుగా ఆన్‌లైన్ ద్వారానే వివాహాలు రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటును కల్పిస్తూ మంత్రివర్గం తీర్మానించింది. గురువారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన విధానసౌధలో కేబినెట్ భేటీ జరిగింది. హిందూ వివాహ చట్టాన్ని మార్పు చేస్తూ మంత్రివర్గం తీర్మానించింది. గ్రామవన్, కావేరీ -2 ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో వివాహాల రిజిస్ట్రేషన్‌లకు బ్రేక్ వేశారు. కేబినెట్ తీర్మానాలను శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు.

● ఈనెల 12నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరిగేలా కేబినెట్ తీర్మానించింది. 12న సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ప్రసంగించనున్నారు. 16న సీఎం సిద్దరామయ్య ఆర్థికమంత్రి హోదాలో 2025-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ప్రవేశపెట్టేలా తీర్మానించారు. శాసనసభ సమావేశాలు ఈనెల 23వరకూ కొనసాగేలా నిర్ణయించారు.

● కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలను సడలించారు. క్రీడాకారులకు రెండుశాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీర్మానించారు.

● కర్ణాటక గ్రామస్వరాజ్ పంచాయతీరాజ్ సవరణ 2024 చట్టాన్ని ఆమోదించారు.

● హాసన్ మెడికల్ కళాశాల ప్రాంగణంలో 450 పడకల సామర్థ్యం పెంచేందుకు రూ.142.47 కోట్లు కేటాయించారు.

● రాయచూరు యూనివర్సిటీ ప్రాంగణంలో కల్యాణకర్ణాటక మానవ జీనోమ్ అధ్యయన సంస్థ నిర్మాణాలకు రూ.47.32 కోట్లు కేటాయిస్తూ తీర్మానించారు.

● మైసూరు జిల్లా హుణసూరు తాలూకా దొడ్డహుణసూరు గ్రామంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాలకు భూమి కేటాయిస్తూ నిర్ణయించారు.

● 2023-24కు అనుగుణంగా 104 కర్ణాటక పబ్లిక్ పాఠశాల నిర్మాణాలకు రూ.60కోట్లు ద్వారా నైపుణ్య వాతావరణం కల్పించదలచారు.

● 10 మహానగర పాలికెలు, 24 నగరసభల పరిధిలో విద్యుత్ స్మశాన వాటికలను రూ.136 కోట్లతో ఏర్పాటుకు నిర్ణయించారు.

● బయ్యప్పనహళ్ళిలో నిర్మించిన సర్‌ఎం విశ్వేశ్వరయ్య రైల్వే టర్మినల్ బ్రిడ్జి నిర్మాణాలకు రూ.263కోట్లు కేటాయించారు. రెండులేయర్ల మార్గంగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం.

● బెళగావి తాలూకా ఉచ్చగాంవవ్, సంతిబస్తివాడ హోబళి పరిధిలో 20 చెరువులకు నీరు మళ్ళించేందుకు రూ.287.55 కోట్లకు అనుమతిచ్చారు.

●బెళగావి జిల్లా హీరేబాగవాడి పరిధిలో 61 చెరువులకు నీరుమళ్ళించేందుకు రూ. 625కోట్ల కేటాయింపు.

● రాయచూరు తాలూకా చిక్కమంచాల గ్రామం వద్ద తుంగభద్రానదికి బ్రిడ్జికం బ్యారేజి నిర్మాణాలకు రూ.158.10 కోట్లు కేటాయిస్తూ తీర్మానించారు.

●నాబార్డ్ ఆర్‌ఐడీఎఫ్-29 సాయంతో ఆరు జిల్లాల పరిధిలో ఆరు భారీ శీతలగిడ్డంగుల నిర్మాణాలకు రూ.65.97కోట్లకు అనుమతించారు. హావేరి, కోలార్, మండ్య, శివమొగ్గ, విజయపుర, హాసన్ జిల్లాలో నిర్మాణాలు జరపనున్నారు.

●రాజీవ్‌గాంధీ వైద్యవిశ్వ విద్యాలయం ద్వారా కలబురగి, మైసూరులలో ప్రగతికి రూ.99 కోట్లు, మంగళూరులో అత్యాధునిక కౌశల్య ప్రయోగశాలకకు రూ.49.75 కోట్లు కేటాయిస్తూ తీర్మానించారు.

●రాష్ట్ర వ్యాప్తంగా ఉండే 1,37,469ల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు రెండు చీరలు ఇచ్చేందుకు రూ.13.75 కోట్లు కేటాయించారు.

● యాదగిరి మెడికల్ కళాశాలకు కొత్తగా కళాశాల భవనాలు, హాస్టల్, బోధన, బోదనేతర సిబ్బంది వసతి నిలయాలకు రూ.461 కోట్లు కేటాయించారు. చిక్కమగళూరు మెడికల్ కళాశాల ప్రగతికి రూ.455 కోట్లు కేటాయించారు. గుల్బర్గా మెడికల్ కళాశాలకు 300ల పడకల పెంపుకు రూ.126 కోట్లు కేటాయించారు.

● బెంగళూరు మహానగర పాలికెలో 110గ్రామాలలో నీరు సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కొరకు రూ.208.45 కోట్లకు అనుమతిచ్చారు.

● బెంగళూరు కేసీ జనరల్ ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు రూ.150కోట్లు కేటాయించారు. చామరాజపేట పరిధిలో వర్షపునీరు పునః వినియోగానికి రూ.30కోట్లతో పనులకు అనుమతించారు. వీటితో పాటు గుల్బర్గా, హావేరి మెడికల్ కళాశాల, ఆరు ఐటీఐ కేంద్రాల అభివృద్ధికి గ్రాంట్‌లు మంజూరు చేస్తూ తీర్మానించారు.

మంగళూరు రైలు సేవలు కోజికోడ్ వరకు విస్తరణ

బెంగళూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని యశ్వంతపురం రైల్వేస్టేషన్ నుండి ప్రతి రాత్రి కణ్ణూరుకు వరకు ప్రయాణించే రైలును కోజిక్కోడ్ వరకు విస్తరిస్తూ దక్షిణ రైల్వే నిర్ణయం తీసుకుంది. యశ్వంతపురం నుంచి బయల్దేరే 16511 నెంబరు రైలు కోజిక్కోడ్‌కు మధ్యాహ్నం 12.40కు చేరుకుంటుంది. ఈ రైలు తలశేరి, వడకర, క్విలాండిలో ఆగనుంది. తిరుప్రయాణంలో 16512 నెంబరు రైలు మధ్యాహ్నం 3.30కు బయల్దేర నుంది. ఈ రైలును 2007లో తొలుత యశ్వంతపురం-మంగళూరుల మధ్య ప్రవేశపెట్టారు. 2009లో తిరిగి కేరళలోని కణ్ణూరు వరకు విస్తరించారు. దక్షిణ రైల్వే తీసుకున్న తాజా విస్తరణ నిర్ణయంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. కోజిక్కోడ్ వరకు రైలును విస్తరించడం వల్ల సీట్ల కొరత ఏర్పడుతుందని వాపోతున్నారు. ఈ రైలును యశ్వంతపురం- కార్వార్‌లకు మంగళూరు మీదుగా నడుపాలని అంతగా అయితే కోజిక్కోడ్‌కు ప్రత్యేక రైలు వేయాలని కోరుతున్నారు.

బీజేపీలో చేరేది లేదు : లక్ష్మణసవది

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీజేపీలో చేరుతారనేది కేవలం కొందరి ప్రచారం మాత్రమేనని, వందసార్లయినా చెబుతానని బీజేపీలో చేరే ప్రసక్తే లేదని బెళగావి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మణసవది తేల్చి చెప్పారు. గురువారం బెంగళూరు ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే పదిసార్లు చెప్పానని ఎన్నిసార్లు ఎక్కడ అడిగినా మార్పు ఉండదన్నారు. ఇతరుల విషయం గురించి చెప్పనంటూ దాటవేశారు. సముచిత అవకాశం కల్పించనందుకే బీజేపీను వీడి కాంగ్రెస్‌లో చేరానన్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆలోచిస్తున్నట్లు తెలిపారు. కెరెగోడులో పతాక అంశాన్ని మీడియా దారితప్పిస్తోందన్నారు.

సాహితీ సమ్మేళనం అర్థవంతంగా జరపండి : సీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండ్యలో 87వ సాహిత్య సమ్మేళనం అర్థపూర్వకంగా నిర్వహించాలని సీఎం సిద్దరామయ్య సూచించారు. మండ్య జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమ్మేళనం ముందస్తు సమావేశం గురువారం అధికారిక నివాసం కృష్ణలో జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి చలువరాయస్వామి, కన్నడసాహిత్య పరిషత్ అధ్యక్షులు మహేష్‌జోషితో పాటు పలువురు ముఖ్యులు భాగస్వామ్యులయ్యారు. సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ జూన్ తొలివారంలో మండ్యలో 87వ అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనం జరపాలన్నారు. ఆడంబరంగా కాకుండా అర్థపూర్వకంగా జరపాలన్నారు. సమ్మేళనంకు రూ.30కోట్లు మంజూరు చేయాలని మహేష్ జోషి విన్నవించారు. పరిశీలిద్దామని సీఎం హామీ ఇచ్చారు. కన్నడ సంస్కృతి శాఖా మంత్రి శివరాజ్‌తంగడిగ, ఎమ్మెల్యే నరేంద్రస్వామి, కన్నడ సంస్కృతిశాఖ కార్యదర్శి మంజుళా, డైరెక్టర్ దరణీదేవి తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు వినతి పత్రం ఇస్తున్న కసాపా అధ్యక్షుడు మహేష్‌జోషి, చిత్రంలో మంత్రులు

భార్యపై అనుమానం.. 12 ఏళ్లుగా గృహనిర్బంధం

- బకెట్‌లోనే మలమూత్ర విసర్జన - విముక్తి కలిగించిన పోలీసులు



పిల్లలతో బాధితురాలు సుమ

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం పెంచుకున్న ఓ కిరాతకుడు, ఆమెను చిత్రహింసలకు గురిచేశాడు. పన్నెండేళ్లుగా గృహ నిర్బంధం చేశాడు. కర్ణాటకలోని మైసూరు జిల్లా హెచ్‌డీ కోట తాలూకా హెచ్.మటెకెరె గ్రామంలో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, వివిధ శాఖల అధికారులు ఆ ఇంటిపై దాడి చేసి నిర్బంధంలో ఉన్న మహిళకు విముక్తి కలిగించారు. మటెకెరె గ్రామానికి చెందిన సణ్ణాలయ్యను ఇద్దరు భార్యలు విడిచిపెట్టారు. ఆ తర్వాత సుమ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. గతంలో విడిచిపెట్టిన ఇద్దరు భార్యల తరహాలోనే సుమ కూడా విడిచి వెళ్లిపోతుందని అనుమానించాడు. తన ఇంట్లోని ఓ గదిలో ఆమెను బంధించాడు. గదికి ఉన్న కిటికీకి కూడా సంచులతో పూర్తిగా మూసివేశాడు. గదిలో టాయిలెట్ లేని కారణంగా ఓ బకెట్‌ను ఉంచాడు. అందులోనే ఆమె మలమూత్రవిసర్జన చేసేది. ఉదయం పని కోసం బయటకు వెళితే రాత్రి పొద్దుపోయేదాక సణ్ణాలయ్య తిరిగి వచ్చేవాడు కాదు. అప్పటిదాకా ఆమె గదిలోపలే ఉండేది. ఆమె ఉండే గదికి రెండు తాళాలు వేసేవాడు. మరో రెండుగదులకు బయట తలుపులకు డోర్‌లాక్ చేసేవాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలిద్దరూ ఉదయం పాఠశాలకు సాధారణంగానే వెళ్లేవారు. సాయంత్రం పాఠశాల నుంచి వచ్చినా, తలుపులు మూసి ఉంటున్నందున.. రాత్రి తండ్రి వచ్చేదాకా బయటే గడిపేవారు. ఈ విషయమై గ్రామస్థులు పలుమార్లు మందలించినా సణ్ణాలయ్యలో మార్పు రాలేదు. పైగా తన కుటుంబం జోలికి వస్తే బాగుండదని హెచ్చరించేవాడు. దీంతో ఎవరూ పట్టించుకోకుండా వదిలేశారు. చివరకు సుమ పుట్టినింటి వారు వచ్చినా ఇదే విధంగా వ్యవహరించేవాడు. ఓ న్యాయవాది ద్వారా పోలీసులకు ఈ సమాచారం తెలిసింది. దీంతో బుధవారం రాత్రి పోలీసులు, సాంత్వన కేంద్రం సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకున్నారు. ఇంటి తలుపులు బద్దలుకొట్టి బాధిత మహిళకు విముక్తి కలిగించారు. ఈ సందర్భంగా బాధితురాలు సుమ అధికారులు, మీడియాతో మాట్లాడారు. తాను 12 ఏళ్లుగా నరకం చూస్తున్నాని వాపోయారు. ఎవరితోనూ మాట్లాడరాదని, కిటికీ నుంచి బయటకు చూస్తే చాకుతో పొడిచి చంపేస్తానని తనను బెదిరించేవాడని ఆమె అన్నారు. గ్రామస్థులు జోక్యం చేసుకుని పంచాయితీ పెట్టినా తన భర్త వారిని హెచ్చరించేవాడని అన్నారు. బాధిత మహిళ సుమ అంగీకారం మేరకు పోలీసులు, అధికారులు ఆమెను పుట్టినింటికి చేర్చారు. హెచ్‌డీ కోట తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు : ఇద్దరి దుర్మరణం

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): హాసన్ జిల్లా ఆలూరు తాలూకా ఈశ్వరహళ్ళిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం ఉదయం సంఘటన చోటుచేసుకుంది. ఆగి ఉన్న లారీను వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే ప్రాంతానికి చెందిన ప్రదీప్(30), గురు(25) అనే ఇద్దరు దుర్మరణం చెందినవారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదరికంలో 111వ స్థానంలో భారత్: ప్రియాంక ఖర్గే



బెంగళూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుండి పూర్తిగా బయటపడ్డారంటూ కేంద్రం అంకెల గారడీ చేస్తోందని మంత్రి ప్రియాంక ఖర్గే పేర్కొన్నారు. బెంగళూరులోని సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ళపాలనలో దేశం 111వ స్థానంలోనూ, ఆకలిలో 112వ స్థానంలోనూ, అవినీతిలో 98వ స్థానంలోనూ ఉందన్నారు. ఈ గణాంక వివరాలు తాము సృష్టించినవి గావని అంతర్జాతీయ స్థాయిలో ప్రకటించినవని చెప్పారు. గత పదేళ్ళలో 10 కోట్ల ఉద్యోగాలు లేవు. రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు. కన్నడిగులకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. జీఎస్‌టీ వాటా చెల్లింపులో రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని, మోదీ ప్రకటిస్తున్న గ్యారెంటీలలో 50 శాతం కన్నడిగుల చెమట దాగి ఉందని, జలజీవన్ మిషన్‌లో 50 శాతం కృషి కన్నడిగులకే దక్కుతుందని చెప్పారు. రాష్ట్రం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఎలాంటి మేలు చేయకపోగా అన్యాయం చేస్తున్నారని ఆయన ఆక్రోశం వ్యక్తం చేశారు.

లోక్‌సభ ఎన్నికల తర్వాత గ్యారెంటీలు ఉండవు

ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు 'ముఖ్యమంత్రి' చంద్రు



బెంగళూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచినా లేదా ఓడినా గ్యారెంటీలు ఉండవని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు పేర్కొన్నారు. గురువారం యాదగిరిలో మీడియాతో మాట్లాడుతూ శాసనసభలో గెలిచేందుకు మాత్రమే గ్యారెంటీ పథకాల హామీలు ఇచ్చారన్నారు. భవిష్యత్ ఆలోచనలు లేకుండానే గ్యారెంటీలు ప్రకటించారన్నారు. గ్యారెంటీలు ఆరంభించిన ఎనిమిది నెలల వ్యవధిలోనే వందశాతం పూర్తీ చేయలేక పోయారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బానిసలుగా పనిచేస్తామని చెప్పుకున్న కాంగ్రెస్ నేతలు ప్రజలను కట్టు బానిసలుగా మార్చేశారన్నారు. రాష్ట్ర ప్రజల సొమ్ముద్వారా గ్యారెంటీలు అమలు చేస్తూ వచ్చే ఎన్నికలలో గెలవకుంటే పథకాలు రావనేది ఎంతవరకూ సమంజసమన్నారు. ఎస్సీ,ఎస్టీ వర్గీయులకు కేటాయించిన బడ్జెట్ గ్రాంట్‌లలోని 11వేల కోట్లను గ్యారెంటీలకు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. గృహజ్యోతి గ్యారెంటీ ప్రభావానికి రైతులకు విద్యుత్ తగ్గించేశారని తద్వారా పంటల సాగు సాధ్యం కావడం లేదన్నారు. రాష్ట్రంలో ఎన్నో తీవ్రమైన సమస్యలు ఉన్నాయని మేకెదాటు, మహదాయి జల సమస్యలకు దశాబ్దాలు దాటుతోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని చెరుకు రైతులకు బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదన్నారు. కేంద్రప్రభుత్వం శ్రీమంతులకు 11లక్షల కోట్ల రుణం రైటాఫ్ చేసిందన్నారు. వీటి గురించి ప్రభుత్వం తరుపున పోరాటాలు చేసి సాధించకుండా మండ్య జిల్లా జెండా సమస్యను పెనుదుమారంగా మార్చేశారని మండిపడ్డారు. ప్రజలు ఎన్నికలలో గుర్తెరిగి ఓట్లు వేయాలన్నారు.

27 ఏళ్ల తర్వాత హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా కర్ణాటక వాసి



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దినేష్‌కుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం తర్వాత కర్ణాటక వాసికి హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ దినేష్‌కుమార్ చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి కల్పించారు. ఎస్‌పీ హకీం ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన 27 ఏళ్ల తర్వాత రాష్ట్రానికి చెందిన దినేష్‌కుమార్‌కు అదే హోదా లభించింది. దినేష్‌కుమార్ 1990లో లా కోర్సు చేసి న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. 1998లో కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా చేరి 2003 నాటికి కేంద్ర ప్రభుత్వ సీనియర్ అడ్వొకేట్‌గా సీబీఐ, బీఎస్‌ఎన్‌ఎల్, యూపీఎస్సీ, యూజీసీ బెస్కాం, బీడీఏతో పాటు వివిధ విభాగాల తరపున పనిచేశారు. 2015 జనవరి 2న హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులై 2016 డిసెంబరు 20న రెగ్యులర్ అయ్యారు. ఇటీవలే దినేష్‌కుమార్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. కాగా ఈనెల 24న ఆయన పదవీ విరమణ పొందనున్నారు. న్యాయమూర్తి ఎస్‌పీ హకీం 1996 మే 3న నుంచి 9వ తేదీ దాకా కేవలం ఆరు రోజులు మాత్రమే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా వ్యవహరించారు. ఆతర్వాత 15 మంది చీఫ్ జస్టిస్‌లుగా వ్యవహరించినా అందరూ ఇతర రాష్ట్రాలకు చెందినవారే. ఇలా 27 ఏళ్ల తర్వాత కర్ణాటక వాసి దినేష్‌కుమార్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు.

నిధులన్నీ ఉత్తరాది రాష్ట్రాలకేనా..? : డీకే సురేష్

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ సభ్యుడు డీకే సురేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దక్షిణభారత్‌కు చెందిన నిధులు ఉత్తరభారత్‌కు పంచుతున్నారని, ఇదే విధానం కొనసాగితే తాము ప్రత్యేక దేశం కోరాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఆయన కన్నడ మీడియాతో గురువారం మాట్లాడారు. దక్షిణభారత్‌కు చెందిన నిధులను ఉత్తరాదికి పంపుతున్నారని, తద్వారా తమకు ఆర్థిక సమస్యలు వస్తున్నాయని ఆయన అన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే దక్షిణ భారత్‌ను ప్రత్యేక దేశం చేయాలనే డిమాండ్ వస్తుందని వ్యాఖ్యానించారు. ప్రతి దశలోనూ గమనిస్తున్నామని, దక్షిణభారత్‌కు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆయన విమర్శించారు. తమ వాటా గ్రాంట్లు రావడం లేదని, పైగా ఉత్తరాదికి కేటాయిస్తున్నారని ఆరోపించారు. తమకు అన్ని విషయాల్లోనూ అన్యాయమే జరుగుతోందని అన్నారు. తమపై హిందీ భాషా ఒత్తిడి తెస్తున్నారని, కన్నడలో బోర్డులు ఏర్పాటు అంశానికి కర్ణాటక గవర్నర్ ఆర్డినెన్స్‌ను తిరస్కరించారని అన్నారు.

సన్ ఆఫ్ ముత్తణ్ణ ఫస్ట్‌లుక్ విడుదల

కన్నడ చిత్రజ్యోతి



సన్ ఆఫ్ ముత్తణ్ణ చిత్రంలోని సన్నివేశం

బెంగళూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): యంగ్ డైనమిక్ ప్రణమ్ దేవరాజ్ నటిస్తున్న సన్‌ఆఫ్ ముత్తణ్ణ సినిమా ఫస్ట్‌లుక్ విడుదలైంది. ప్రణమ్ పుట్టినరోజే పోస్టర్‌ను ఆవిష్కరించడం విశేషం. ఈ సందర్భంగా చిత్రం యూనిట్ మీడియాతో ముచ్చటించింది. హీరో ప్రణమ్ దేవరాజ్ మాట్లాడుతూ దర్శకుడు శ్రీకాంత్ కథ చెప్పిన వెంటే బాగా నచ్చేయడంతో సంతోషంగా అంగీకరించానన్నారు. హీరోయిన్ రుషి రవి మాట్లాడుతూ ఈ సినిమా టైటిల్ చాలా పవర్‌ఫుల్‌గా ఉందని పాజిటివ్ వైబ్రేషన్స్ వస్తున్నాయని చెప్పారు. టైటిల్ చూసి సినిమాలో నటించేందుకు అంగీకరించానన్నారు. ప్రణమ్‌తో కలిసి సినిమా చేస్తుండటం చాలా సంతోషంగా ఉందని రంగాయణ రఘు కెమెరా ఎలా ఫేస్ చేయాలో తనకు నేర్పి ప్రోత్సహించారన్నారు. దర్శకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ దేవరాజ్ ఈ సినిమా కథచెప్పగానే వెన్నుతట్టి పోత్సహించారన్నారు. ఈ సినిమా తండ్రీ కొడుకుల సెంటిమెంట్ ప్రధానంగా ఉంటుందని వారణాసిలో తాజాగా చిత్రీకరణ పూర్తిచేసుకున్నామన్నారు. ఈ సినిమాకు సంబంధించి ఇక కేవలం ఒక పాట బాకీ ఉందని దీన్ని పాండిచ్చేరిలో చిత్రీకరించాలని నిర్ణయించామని చెప్పారు. చిత్రంలో రంగాయణ రఘు, సుచేంద్ర ప్రసాద్, గిరిశివణ్ణ, తబల నాణి, శ్రీనివాస్ ప్రభు, సుధా బెళవాడి, అరుణ్ చక్రవర్తి ప్రధాన పాత్రలను పోషించారు. పురాతన ఫిలింస్ పతాకంపై ఎస్‌ఆర్‌కె.ఫిలింస్ సహకారంతో నిర్మిస్తున్న ఈ సినిమాకు సచిన్ బస్కూర్ సంగీతాన్ని సమకూర్చారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ ముగింపు దశలో ఉందని దర్శకుడు గురువారం మీడియాకు వెల్లడించారు.

9న విడుదల కానున్న జూని



జూని చిత్ర తారాగణం

చందనసీమంలో జూని ట్రేలర్ తీవ్ర హల్‌చల్ చేస్తోంది. రేణుకాంబ స్టూడియోలో ట్రేలర్ విడుదల అనంతరం హీరో పృథ్వీ అంబార్ మీడియాతో మాట్లాడుతూ ఈ సినిమా కథ చాలా భిన్నంగా ఉంటుందని చిత్రం యూనిట్ మొత్తం అంకిత భావంతో బాగా కష్టపడిందని ప్రశంసలు గుప్పించారు. హీరోయిన్ రిషికా మాట్లాడుతూ 2022లో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైందని ఇది తనకు రెండో సినిమా అన్నారు. సినిమాలో తన పాత్ర బాగా నచ్చిందన్నారు. వినోదంతో పాటు చక్కటి సందేశాన్ని కూడా ఈ సినిమా ద్వారా దర్శకుడు ఇచ్చారన్నారు. దర్శకుడు వైభవ్ మహదేవ్ మాట్లాడుతూ ఈ సినిమా రాష్ట్రమంతటా ఈ నెల 9న విడుదల కానుందన్నారు. సినిమా కథపై తనకు పరిపూర్ణ నమ్మకం ఉందన్నారు. త్రిశూల క్రియేషన్స్ పతాకంపై మోహన్‌కుమార్ ఈ సినిమాను నిర్మించారు. వై.శ్రేయస్ సహనిర్మాతగా ఉన్నారు. జూని సినిమా చిత్రీకరణ మొత్తం బెంగళూరు చుట్టుపక్కలే జరిపామని నకుల్ అభ్యంకర్ సంగీతాన్ని అందించారని దర్శకుడు వైభవ్ వెల్లడించారు.

దశాబ్దం తర్వాత మళ్లీ తెరపైకి రంగితరంగ జోడి



నిరూప్‌భండారి, సాయికుమార్

దశాబ్దం క్రితం చందనసీమంలో రంగితరంగ సృష్టించిన హంగామా అంతా ఇంకా కాదు. అప్పట్లో సూపర్‌హిట్టయిన ఈ సినిమాలో పోస్ట్‌మాన్ కాళింగ పాత్రలో హీరో సాయికుమార్, నటుడు నిరూప్‌భండారి నటించిన సంగతి విదితమే. పదేళ్ళ సుదీర్ఘ విరామం తర్వాత సచిన్ వాలి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న సరికొత్త చిత్రంలో వీరిద్దరూ మళ్ళీ నటిస్తుండటం విశేషం. అప్పటి సినిమాలో విలన్‌గా రాణించిన సాయికుమార్ ఈ సినిమాలో మాత్రం నిరూప్ తండ్రిగా విలక్షణమైన పాత్రను పోషించబోతున్నారని దర్శకుడు సచిన్ గురువారం మీడియాకు చెప్పారు. నిజం అబద్ధం మధ్య సాగే ఈ కామిడీ ఎంటర్‌టైన్ మెంట్ చిత్రాన్ని అంకేత్ సినిమాస్ పతాకంపై అంకిత్‌సోని నిర్మిస్తున్నారు. ప్రశాంత్ ములగె సహనిర్మాతగా ఉన్నారు. సచిన్ బస్రూర్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జోరుగా సాగుతోంది.

8న వెండితెరపైకి ఒందు సరళ ప్రేమకథె



సినిమాలో వినయ్ రాజ్‌కుమార్, మల్లికాసింగ్

సింపల్ సుని దర్శక సారథ్యంలో ఒందు సరళ ప్రేమకథె సినిమా ఈ నెల 8న వెండితెరపైకి వస్తోంది. సినిమా ప్రచార కార్యక్రమాన్ని కూడా అత్యంత వినూత్నంగా నిర్వహిస్తూ ప్రేక్షకుల్లో క్రేజ్‌ను పెంచుతున్నారు. ఒక్కో పాటను విడుదల చేస్తూ వచ్చిన చిత్ర నిర్మాత తాజాగా సూఫీ శైలిలో సాగే పాటను ప్రేక్షకుల ముందుకు తెచ్చారు. హీరో వినయ్ రాజ్‌కుమార్, హీరోయిన్ మల్లికా సింగ్‌లపై చిత్రీకరించామని ఈ పాట ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడం ఖాయమని నిర్మాత మైసూరు రమేష్ గురువారం మీడియాకు చెప్పారు. ఈ చిత్రంలో రాఘవేంద్ర రాజ్‌కుమార్ ఒక ప్రత్యేక పాత్రలో కనిపిస్తారన్నారు. సాధుకోకిల, రాజేష్ నటరంగ ప్రముఖ పాత్రలను పోషించారన్నారు. ఈ చిత్రంలో పాటలకు వీర్ సమర్థ్ సంగీతాన్ని సమకూర్చారన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుందని ప్రత్యేకించి యువతకు బాగా నచ్చుతుందని నిర్మాత తెలిపారు.